అత్యవసరమైతే అవస్థే

- ప్రభుత్వ కార్యాలయాల్లో కనిపించని మరుగుదొడ్లు
- వివిధ పనులపై వచ్చే ప్రజలకు తప్పని తిప్పలు
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



ప్రభుత్వ కార్యాలయాల సముదాయం

సీతారామపురం: ప్రతిఇంట్లో మరుగుదొడ్లు నిర్మించుకోవాలంటూ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ విస్తృతంగా అవగాహన కల్పిస్తుంటారు. మరుగుదొడ్లు నిర్మించుకోకపోతే సంక్షేమ పథకాలను నిలిపివేస్తుంటామని హెచ్చరిస్తుంటారు. స్వచ్ఛభారత్ పేరుతో మరుగుదొడ్ల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించే అధికారులు తమ కార్యాలయాలపై దృష్టి సారించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేకపోవడం..ఉన్నా అధ్వానంగా తయారవడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనులపై వచ్చే కార్యార్థులు ఒకటి, రెండుకు అత్యవసరమైతే ఆరు బయటకు పరుగులు తీయాల్సి వస్తోంది. ముఖ్యంగా మహిళలకు ఆత్మగౌరవం ప్రశ్నార్థకంగా మారింది. సీతారామపురంలో మండల పరిషత్, తహసీల్దార్, వ్యవసాయ శాఖ, విద్యాశాఖ, వెలుగు, ఉపాధి హామీ కార్యాలయాలతో పాటు బిట్-1 సచివాలయం, రైతుసేవా కేంద్రం, ప్రభుత్వ ఆస్పత్రి, పశువైద్యశాల ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. ఈ కార్యాలయాలకు నిత్యం వివిధ పనులపై వందలాది మంది వస్తుంటారు. అయితే మండల కార్యాలయాల సముదాయంలో ప్రజామరుగుదొడ్లు లేవు. దీంతో అత్యవసరమైతే గోడ, చెట్ల చాటుకు వెళ్లి పని ముగించాల్సి వస్తోందని కార్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని కార్యాలయాల్లో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ వాటిని ఉద్యోగులు మాత్రమే వాడుతున్నారు. మరికొన్ని కార్యాలయాల్లో నిర్వహణ లేక అధ్వానంగా తయారవడంతో ఉద్యోగులు కూడా ఆరు బయటే పని కానిస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా ఇలాంటి పరిస్థితులే నెలకొని ఉన్నాయి.



మరుగుదొడ్లు లేని వెలుగు భవనం

ఆత్మగౌరవం కోసం ఇంటింటికి మరుగుదొడ్లు నిర్మించుకోవాలని చెప్పే అధికారులు సొంత కార్యాలయాల్లో వాటి నిర్వహణపై దృష్టి సారించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

మరుగుదొడ్లు నిర్మించాలి



బహిరంగ మలమూత్ర విసర్జన చేయరాదని అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తుంటారు. అదే ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయానికి వచ్చినప్పుడు మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మరుగుదొడ్లను నిర్మించాలి.

-రఘురాములు, సీతారామపురం

మహిళల బాధలు వర్ణనాతీతం



మండల ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వివిధ పనులపై ప్రజలు వస్తుంటారు. మండల ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో మరుగుదొడ్లు లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి మరుగుదొడ్లను నిర్మించాలి.

- బొగ్గవరపు రత్నం,అయ్యవారిపల్లి

చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి రూరల్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు మాదక ద్రవ్యాలతో తలెత్తే అనర్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసై జీవితాన్ని చేతులారా నాశనం చేసుకోవద్దన్నారు. వాటి వాడినా, విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇటీవల సైబర్ మోసాలు ఎక్కువవవుతున్నాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ యాప్‌ల వైపు ఆకర్షితులు కాకుండా వాటికి దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జన ఏర్పాట్లపై పరిశీలన



సంగం: వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో స్థానిక పెన్నా బ్యారేజీను సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్, పంచాయతీ కార్యదర్శి నరసయ్య శుక్రవారం పరిశీలించారు.గణేశ్ నిమజ్జనానికి సంబంధించి బ్యారేజ్ వద్ద ముందస్తుగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా సీఐ వేమారెడ్డి మాట్లాడుతూ సంగం సర్కిల్ పరిధిలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని సూచించారు. సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో అనుమతులు మంజూరు చేస్తున్నట్లుగా తెలిపారు. మండపాల నిర్వాహకులు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని జారీ చేస్తామన్నారు. అనుమతులు లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న మాలకొండారెడ్డి

కావలి (జలదంకి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని లోక్ అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి తెలిపారు. కావలిలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల నిషేధ చట్టంపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలకొండారెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలతో తలెత్తే ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలను వివరించారు. బాలికలకు బాల్యవివాహాలు చేయకుండా చదివించాలని సూచించారు. పేదరికం, నిరక్షరాస్యత కారణంగా గిరిజన కాలనీల్లో బాలికలకు బాల్యవివాహాలు చేస్తున్నారన్నారు. గిరిజన కాలనీల్లో అక్షరాస్యతను పెంచడంతో పాటు సంక్షేమ పథకాలు అందించడం ద్వారా బాల్యవివాహాల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త జీవీ శారద, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

అక్షర ఆంధ్ర విజయవంతానికి సహకరించండి



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి (జలదంకి): ప్రభుత్వం అమలు చేస్తున్న అక్షర ఆంధ్ర-వయోజన విద్య కార్యక్రమానికి వలంటీర్లు ముందుకొచ్చి సహకరించాలని కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ కోరారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అక్షర ఆంధ్ర-వయోజన విద్య కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని 40 వార్డుల్లో నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి వలంటీర్ల ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అక్షర ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లుగా తెలిపారు. ఇందుకోసం పుస్తకాలు, ఇతర సామగ్రిని ఉచితంగా అందజేస్తామన్నారు. స్వచ్ఛందంగా వలంటీర్‌గా పనిచేయడానికి ఆసక్తి కలిగిన వారు ముందుకు రావాలని కోరారు. అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేసే బాధ్యతను తీసుకోవాలని స్వచ్ఛంద సంస్థలను కోరారు. మెప్మా కోఆర్డినేటర్ భారతి పాల్గొన్నారు.

వెంకటంపేటలో పిచ్చికుక్క స్వైరవిహారం

దుత్తలూరు: మండలంలోని వెంకటంపేటలో గురువారం సాయంత్రం పిచ్చికుక్కస్వైర విహారం చేసింది. పది మందిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. పిచ్చికుక్కను గ్రామస్తులు వెంటాడి చంపేశారు. శుక్రవారం గాయపడిన వారు ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రేబిస్ వ్యాక్సిన్ వేయించుకున్నారు. కాగా గ్రామంలో వీధికుక్కల బెడద అధికంగా ఉంది. వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ప్రస్తుతం పిచ్చికుక్క మరో పది వీధికుక్కలను కరవడంతో గ్రామంలో తిరగాలంటే భయమేస్తోందని వాపోయారు. ఇప్పటికైనా మండలాధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ నిరంజన్ శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు.

భూసేకరణకు డీటీ డిప్యుటేషన్

సీతారామపురం : మండల డిప్యూటీ తహసీల్దార్ షేక్ సందానిని రామాయపట్నం భూసేకరణ విభాగానికి డిప్యుటేషన్‌పై పంపారు. కందుకూరు డివిజన్ కరేడు ప్రాంతంలో చేపడుతున్న భూసేకరణ కోసం జిల్లాలోని పలువురు రెవెన్యూ అధికారులను డిప్యుటేషన్ వేసినట్లు సమాచారం. అందులో భాగంగా ఇటీవల మండలానికి వచ్చిన డీటీని సైతం డిప్యుటేషన్‌పై పంపారు.

కిలో పొగాకు సగటు ధర రూ.183

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకు సగటు ధర రూ.183.62 పలికిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 425 బేళ్లు రాగా, 229 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.290, కనిష్ఠంగా రూ.140, సగటున రూ.183.62 ధర పలికిందని వివరించారు.

పంట కోత ప్రయోగంపై శిక్షణ

అనుమసముద్రంపేట: మండలంలోని గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు పంట కోత ప్రయోగంపై సహాయ గణాంక అధికారి రాజేంద్రప్రసాద్ శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట దిగుబడులను లెక్కించేందుకు 20 పంట కోత ప్రయోగాలను చేపట్టనున్నట్లు తెలిపారు. వ్యవసాయాధికారి సురేష్‌బాబు మాట్లాడుతూ ఈక్రాప్ నమోదుపై అవగాహన కల్పించారు. ప్రతి రైతు తమ వంతు బాధ్యతగా గ్రామవ్యవసాయ సహాయకులను కలిసి పంట వేసినా, వేయకపోయినా నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ విస్తరణాధికారులు మునెమ్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని అల్లీపురం ప్రాంతానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని అదృశ్యంపై తండ్రి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం కళాశాలకు వెళ్లిన విద్యార్థిని సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు ఇళ్లతో పాటు కళాశాల పరిసరాల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కే జిలానీ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

ఉదయగిరి/సీతారామపురం: శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఉదయగిరి, సీతారామపురం మండలాల్లోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. గండిపాళెం గంగమ్మ, యర్రబల్లిగడ్డ అన్నపూర్ణాదేవి, అప్పసముద్రం మహాలక్ష్మి, ఉదయగిరి సంతానలక్ష్మి, పార్వతీ పరమేశ్వర, ఘటిక సిద్ధేశ్వరం ఇష్టకామేశ్వరీదేవి, సీతారామపురంలోని కన్యకా పరమేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవార్లు విశేషాలంకారాల్లో దర్శనమిచ్చారు.

క్లుప్తంగా

రక్తదాన శిబిరం



ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 65 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలను ప్రిన్సిపల్ నారాయణస్వామి, అధ్యాపకులు అభినందించారు. వైస్‌ప్రిన్సిపల్ ఏ నరసింహులు, ఉదయగిరి సీహెచ్‌సీ వైద్యాధికారి ఠాగూర్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ విక్రమ్, సిబ్బంది సుధీర్, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన



సంగం : స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ వంశీ, డిప్యూటీ ఎంపీడీఓ వరప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ ష్రెడ్డర్ మెషీన్‌ను పరిశీలించి వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శి నరసయ్యకు సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సంపద కేంద్రానికి తరలించాలని, తడి చెత్తను వర్మికంపోస్టుగా మార్చి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను పొడిగా మార్చి రోడ్డు నిర్మాణానికి వినియోగించవచ్చని తెలిపారు.

వ్యవసాయ డ్రోన్ పంపిణీ



అనుమసముద్రంపేట: అనుమసముద్రం రైతు సేవా కేంద్రం పరిధిలోని జ్యోతి రైతు సేవా సంఘానికి కెనరా బ్యాంకు సహకారంతో 80 శాతం సబ్సిడీపై వ్యవసాయ డ్రోన్‌ను శుక్రవారం అందజేశారు. డ్రోగో డ్రోన్ కంపెనీ జిల్లా కోఆర్డినేటర్ యోగేశ్వర్, వీఏఏ లావణ్య, వ్యవసాయ విస్తరణాధికారిణులు మునెమ్మ, భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జ్యోతి రైతు సేవా సంఘం సభ్యులకు డ్రోన్ పరికరాలను అందజేశారు.

ట్రాక్టర్ టైర్ల చోరీ



కొండాపురం: మండల కేంద్రమైన కొండాపురంలోని ఎన్టీఆర్ సుజల స్రవంతి మదర్‌ప్లాంట్ వద్ద ఉన్న ట్రాక్టర్ టైర్లను గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ మదర్ ప్లాంట్ వద్ద 26 ట్రాక్టర్లు ఉన్నాయి. ఇందులో ఒక ట్రాక్టర్ ఇంజన్‌కు ఉన్న రెండు పెద్ద టైర్లను చోరీ చేశారని గ్రామస్తులు తెలిపారు. చోరీపై కొండాపురం పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సందీప్‌ను వివరణ కోరగా తనకు ఇప్పటి వరకు తెలియదని, పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన



ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కళాశాలలోని విద్యార్థులకు సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సార్డ్స్ ప్రతినిధులు మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాప్తి, తలెత్తే అనర్థాలు, నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు హెచ్ఐవీపై అవగాహన కలిగి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. హెచ్ఐవీ బాధితులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేయడంతో పాటు వివరాలను గోప్యంగా ఉంచుతుందని తెలిపారు. ప్రిన్సిపల్ వాణీశ్రీ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఓఆర్‌డబ్ల్యూలు సుస్మిత, సునంద, పీఈలు ఉమామహేశ్వరి, సుగుణ, మహిమలూరు హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



సోమశిల: అనంతసాగరం మండలం లింగంగుంట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. అనంతసాగరానికి చెందిన షేక్ అస్లర్ ద్విచక్ర వాహనంపై ఆత్మకూరుకు వెళ్తూ లింగంగుంట వద్ద అదుపు తప్పి కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని స్థానికులు 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు

అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని నిరసన



జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

సీతారామపురం: సీతారామపురం-డీజీపేట మార్గంలో అదనపు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ పబ్బులేటిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై విద్యార్థులు శుక్రవారం బైఠాయించి నిరసన తెలిపారు. ప్రతిరోజూ ఉదయం ఒక్క ట్రిప్పు మాత్రమే ఉదయగిరి డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు డీజీపేట వరకు వెళ్లి తిరిగి వస్తుంది. డీజీపేట మార్గంలోని గ్రామాల నుంచి సీతారామపురంలోని గౌతమి హైస్కూల్, ఎల్‌వీఆర్ జూనియర్ కళాశాల, ఏపీ మోడల్ స్కూల్, డిగ్రీ కళాశాల, జెడ్పీ హైస్కూల్‌కు విద్యార్థులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అలాగే ఇతర పనుల నిమిత్తం ప్రజలు వస్తుంటారు. పల్లెవెలుగు సర్వీసులో కనీసం నిలబడేందుకు కూడా చోటు లేక డోర్ వద్ద వేలాడుతూ విద్యార్థులు ప్రయాణించాల్సి వస్తోంది. గతంలో బస్సులో నుంచి జారిపడి పలువురు విద్యార్థులు గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. గతంలో ప్రయాణికులు నిరసన వ్యక్తం చేయడంతో కొద్దిరోజులపాటు ఉదయం రెండు ట్రిప్పులు బస్సులను నడిపారు. ప్రస్తుతం ఆర్టీసీ యాజమాన్యం ఒక ట్రిప్పుకే పరిమితం చేయడంతో అదనపు సర్వీసును నడపాలని విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఉదయగిరి డిపో ఆర్టీసీ అధికారులు స్పందించి డీజీపేట మార్గంలో అదనపు బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బీమా పథకాలపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

కావలి (జలదంకి): కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్ గులాటి కోరారు. పట్టణంలోని విశ్వోదయ బాలికల పాఠశాల ఆవరణలో ఎస్‌బీఐ కావలి టౌన్ శాఖ ఆధ్వర్యంలో జన సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పట్టణంలోని పొదుపు మహిళలు, ప్రజలకు బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దినేష్ గులాటి మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, తదితర పథకాలపై అవగాహన కల్పించారు. జన్‌ధన్ ఖాతాలకు సంబంధించి పదేళ్లు పూర్తయిన వారు ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ మురళీనాయక్, ఐస్‌బీఐ నెల్లూరు ఎఫ్ఐ మేనేజర్ పీ మల్లికార్జున బాబు, ఎస్‌బీఐ కావలి బ్రాంచ్ మేనేజర్ రమేష్, చీఫ్‌మేనేజర్ లోకనాథం, మెప్మా కోఆర్డినేటర్ భారతి, ఏపీఎం కృష్ణారావు, పెన్షనర్ అసోసియేషన్ సెక్రటరీ హరినారపరెడ్డి, విశ్వోదయ పాఠశాల హెచ్ఎం జ్యోత్స్న పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికలు



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

సంగం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జూనియర్స్, సబ్ జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో బాలబాలికల షూటింగ్‌బాల్ జట్ల ఎంపికలను శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య, షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణయ్య విచ్చేశారు. వారు మాట్లాడుతూ ప్రతిభ చూపిన క్రీడాకారులు వచ్చే నెలలో బుచ్చిరెడ్డిపాళెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

వినాయక చవితి ఉత్సవాలకు శ్రీకారం



ఆత్మకూరు: పట్టణంలోని జేఆర్‌పేట ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో వినాయక చవితి ఉత్సవాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. గణేశ్‌ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసే ప్రాంతంలో శుభసూచకంగా గుంజను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 27వ తేదీ నుంచి మూడ్రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులు ఓబుల్‌రెడ్డి, ప్రసాద్‌నాయుడు, సురేంద్రరెడ్డి, జీ రామిరెడ్డి, రవీంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కావలి (జలదంకి): మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కే పెంచలనరసయ్య డిమాండ్ చేశారు. కావలిలోని షాదీ మంజిల్‌లో సీఐటీయూ అనుబంధ పట్టణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాల్గో మహాసభను శుక్రవారం నిర్వహించారు. ఈ మహాసభలో పెంచల నరసయ్య మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించాలని చూస్తుందన్నారు. మున్సిపల్ కార్మికులను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్ రెహానాబేగం మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జలదంకి బాబు, కార్యదర్శిగా క్రాంతికుమార్, ఉపాధ్యక్షులుగా రాజ్యలక్ష్మి, శీనయ్య, తదితరులను ఎన్నుకున్నారు. సీఐటీయూ నాయకులు కృష్ణమోహన్, వెంకయ్య పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి



విలేకరులతో మాట్లాడుతున్న ఆత్మకూరు సీఐ వేమారెడ్డి

ఆత్మకూరు/వరికుంటపాడు: ఆత్మకూరు పోలీసు సర్కిల్ పరిధిలో వినాయక చవితి సందర్భంగా విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలను నిర్వహించే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఆత్మకూరు ఇన్‌చార్జి సీఐ వేమారెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఎస్సై ఎస్‌కే జిలానీతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తామన్నారు. డీజే, లౌడ్‌స్పీకర్లు, అశ్లీల నృత్యాలకు అనుమతులు లేవని, అతిక్రమిస్తే కమిటీ సభ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అలాగే వరికుంటపాడు ఎస్సై ఎం రఘునాథ్ విలేకరుల సమావేశం నిర్వహించి చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు.

మండల విద్యాశాఖను ప్రథమ స్థానంలో నిలపాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పాజీ

ఉదయగిరి: విద్యాశాఖకు సంబంధించి అన్ని విషయాల్లో మండలాన్ని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంపీడీఓ అప్పాజీ అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు . ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పాఠశాలలకు వచ్చే నిధులను సక్రమంగా వినియోగించాలన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలన్నారు. ఎంఈఓలు వెంకటేశ్వరరావు, శ్రీనివాసులు మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం, యుడైస్ ప్లస్, డ్రాపౌట్స్ ఎన్‌రోల్‌మెంట్, అపార్ ఐడీ రిజిస్ట్రేషన్‌పై సమీక్షించారు.

పారిశుధ్య పనుల పరిశీలన



సోమశిల: గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అనంతసాగరం మండలం కొత్తపల్లి పంచాయతీలో పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. తడి చెత్తను వర్మికంపోస్టుగా మార్చి విక్రయించడం ద్వారా పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించాలన్నారు.

గ్రావెల్ తవ్వకాలపై పరిశీలన

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పంచాయతీ పరిధిలోని యర్రబల్లిపాళెం చెరువులో గ్రావెల్ తవ్వకాలను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం పరిశీలించారు. నేషనల్ హైవే పనులకు గ్రావెల్ తరలింపునకు సంబంధించి అనుమతుల విషయమై ఇరిగేషన్ ఈఈకు ఫోన్ చేయగా 12 వేల క్యూబిక్ మీటర్లకు అనుమతులు తీసుకున్నారని తెలిపారు. ఒక క్రమపద్ధతి లేకుండా గ్రావెల్‌ను తవ్వడం వల్ల లోతైన గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారుతాయని, ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలోనే గ్రావెల్ తవ్వకాలు చేపట్టాలని సూచించారు. అనుమతులు లేకుండా గ్రావెల్ తరలించే అక్రమార్కులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.